నాట్లు పూర్తయినా సాయం అందలేదు



ఖరీఫ్ వరినాట్లు పూర్తయ్యాయి. ఇప్పటి వరకూ అన్నదాత సుఖీభవకు సంబంధించి ఎలాంటి సాయమూ అందలేదు. వైఎస్ జగన్ ప్రభుత్వ హయాంలో సాగు పనులు ప్రారంభ సమయంలోనే పీఎం కిసాన్ సాయంతో కలిపి రూ.5,500 పెట్టుబడి సాయమందేది. ఆ సాయం పెట్టుబడికి ఎంతగానో ఉపయోగపడేది.

- కేసన వీర్రాజు(బాబు), రైతు, అంద్రంగి, కాజులూరు మండలం

మహిళలకు సాయంపై స్పష్టత ఇవ్వాలి



ఎన్నికల సమయంలో సూపర్ 6 పేరుతో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం వచ్చి 100 రోజులు పూర్తవుతున్నా అమలు చేయడం లేదు. 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకూ నెలకు రూ.1500 చొప్పున సాయమందిస్తానని మేనిఫెస్టోలో చెప్పారు. ఈ విషయమై ఇప్పటి వరకూ ఎలాంటి స్పష్టత ఇవ్వకపోవడం సరికాదు. పథకమేదైనా అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేయనారంభిస్తేనే లబ్ధిదారులకు ప్రయోజనం చేకూరుతుంది.

- కె.కృష్ణవేణి, మండపేట

ఉచిత బస్సు ప్రయాణం హామీ సంగతేంటి?



మహిళలందరికీ ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించే సదుపాయం కల్పిస్తామంటూ కూటమి నేతలు ఎన్నికల ప్రచార కార్యక్రమాల్లో హామీ ఇచ్చారు. ఇప్పటి వరకూ అదిగో, ఇదిగో అంటున్నారు మినహా హామీ అమలుకు సంబంధించిన కార్యాచరణ కానరావడం లేదు.

- పాలంకి కమల, మండపేట

మూడు సిలిండర్లు త్వరగా ఇవ్వాలి



ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఇస్తామని ఎన్నికల సమయంలో కూటమి నేతలు హామీ ఇచ్చారు. అలా ఇస్తాననడంతో సాధారణ కుటుంబాల వారికి ఆశ కలిగింది. ఆ సిలిండర్లను ఇస్తారని ఆశిస్తున్నాను. త్వరితగతిన సిలిండర్ల పంపిణీ ప్రారంభించడం వల్ల ఐదేళ్లు ఈ పథకం ఉపయోగపడుతుంది. జాప్యం చేయడం సరికాదు.

- దొమ్మేటి కృష్ణవేణి, ద్రాక్షారామ, రామచంద్రపురం రూరల్ మండలం

నిరుద్యోగ భృతి ఎప్పడిస్తారు?



నిరుద్యోగులందరికీ భృతి ఇస్తామని ఎన్నికల ముందు చంద్రబాబు హామీ ఇచ్చారు. కొత్త ప్రభుత్వం వచ్చి 100 రోజులు కావస్తున్నా ఇప్పటికీ నిరుద్యోగుల ఊసే ఎత్తడం లేదు. ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం నిరుద్యోగ భృతిని వెంటనే అందించాలి. ఇప్పటి వరకూ ప్రభుత్వం నిరుద్యోగ భృతిపై ఎటువంటి ప్రకటనా చేయలేదు.

- పెంకే శివ, పామర్రు, కె.గంగవరం మండలం


అంతా పథకం ప్రకారమే..



2023లో రైతు భరోసాకు అర్హుల జాబితాను చూసుకుంటున్న రైతులు (ఫైల్)

- వంద రోజులవుతున్నా అందని సాయం
- ప్రజలకిచ్చిన హామీల విస్మరణ దిశగా కూటమి ప్రభుత్వం
- అధికారంలోకి వచ్చాక మారుతున్న సీఎం చంద్రబాబు స్వరం
- ప్రశ్నించని పవన్ కల్యాణ్
- పథకం పేర్లు మారాయి మినహా తలుపు తట్టని లబ్ధి
- హామీల అమలు చేతకాక అప్పుల బాట
- జగనే సీఎం అయి ఉంటే.. ఈపాటికి అమ్మఒడి, రైతు భరోసా సాయం

కపిలేశ్వరపురం: నాలుగు దశాబ్దాల రాజకీయ జీవితం.. మూడు సార్లు సీఎంగా అనుభవం.. అభివృద్ధి ప్రదాత... సంపద సృష్టికర్త... ఇవీ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో నేటి సీఎం చంద్రబాబు తన గురించి తాను ప్రజల ముందు చెప్పుకున్న గొప్పలు. ఇక తాను గెలిస్తే చేసే పనులకు సూపర్ సిక్స్ అని పేరు పెట్టి, ఊరూరా నోటికొచ్చిన హామీలిస్తూ ప్రజలను ఏమార్చారు. అమ్మఒడి స్థానంలో తల్లికి వందనం పేరుతో ప్రతి విద్యార్థికి రూ.15 వేల చొప్పున, రైతు భరోసా స్థానంలో అన్నదాత సుఖీభవ పేరుతో రూ.20 వేల సాయమందిస్తానన్నారు. ఇంటికో ఉద్యోగం, లేదంటే నిరుద్యోగ భృతి, 18 ఏళ్ల నిండిన మహిళలందరికీ నెలకు రూ.1500 చొప్పున సాయమందిస్తానంటూ సూపర్ సిక్స్ పథకాలను హామీగా ఇచ్చారు. హామీలకు నాదీ గ్యారెంటీ అంటూ మరోవైపు నేటి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ముక్తాయింపులతో ఎన్నికల ప్రచారం హోరెత్తింది. ఎల్లో మీడియా రోజూ అవే విషయాలను చెప్పిందే చెబుతూ ఊకదంపుడు ప్రచారం చేశాయి. ఏదైతేనేమీ సీఎంగా చంద్రబాబు, డిప్యూటీ సీఎంగా పవన్ కల్యాణ్ పదవులు చేపట్టారు. ఎన్నికల ప్రచారంలో గంభీరంగా గొంతెత్తి ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాల్సిన సమయం ఆసన్నమయ్యేసరికి వారి స్వరాల్లో మార్పు వచ్చింది. సాయం అందజేతపై సన్నాయి నొక్కులు నొక్కుతున్నారు. రాష్ట్రం అప్పుల పాలైపోయిందంటూ పథకాల అమలును విస్మరించేందుకు యత్నిస్తున్నారు. ఒకవైపు కరోనా కష్టాలు వెంటాడినా, కేంద్ర సాయం అందకపోయినా అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు సాయాన్ని ఎప్పుడూ ఆపలేదు. ఎన్ని కష్టాలు ఎదురైనా పేదలకు లబ్ధి చేకూర్చారు. ఈ ఎన్నికల్లో కూడా జగనే సీఎం అయి ఉంటే ఈపాటికి



అమ్మఒడి రూ.15 వేలు, రైతు కుటుంబానికి రూ.5,500 పెట్టుబడి సాయమందేది. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి చెందిన ఎంపీలపై ఆధారపడి నడుస్తున్న పరిస్థితులు ఉన్నప్పటికీ, చంద్రబాబు, పవన్ కల్యాణ్, పురందేశ్వరి ఏమాత్రం కేంద్రంపై ఒత్తిడి చేయకపోవడంపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.


మారుతున్న చంద్రబాబు స్వరం

ఈ ఏడాది జూన్ 13న సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన చంద్రబాబు పదవి చేపట్టాక తన స్వరం ప్రజా వ్యతిరేకంగా మారింది. ఎన్నికలకు ముందు సంపద సృష్టించి, అన్ని పథకాలూ అమలు చేసే సత్తా నాకుంది... అంటూ గంభీరంగా మాట్లాడిన చంద్రబాబు సీఎం అయ్యారు. మరోసారి సీఎం అయిన హుషారులో 'నేను పాత చంద్రబాబును కాదు... ఇకపై మీరు మారిన చంద్రబాబును చూస్తారంటూ జూన్ 6న టీడీపీ ఎంపీల సమావేశంలో వ్యాఖ్యానించారు. ఇటీవల అసెంబ్లీలో 'సూపర్ 6 అంటే భయమేస్తోందని' వ్యాఖ్యానించడం సంక్షేమ పథకాలపై ఆయనకున్న చిత్తశుద్ధికి నిదర్శనం. రాష్ట్రానికి వస్తున్న ఆదాయం కాస్తా వేతనాలు, పెన్షన్లు, అప్పులు, వడ్డీలకు కూడా సరిపోవడం లేదంటూ ప్రజల నుంచి సానుభూతి పొందేలా స్వరం మార్చారు.

వైఎస్ జగన్ హయాంలో పథకాల అమలు ఇలా..



మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల్లో 310 ప్రాథమిక, 31 ప్రాథమికోన్నత, 64 ఉన్నత మొత్తం 406 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. వీటికితోడు ప్రైవేటు పాఠశాలలు, ఇంటర్మీడియెట్ కళాశాలల్లో వేలాది మంది విద్యార్థులు 'తల్లికి వందనం' పథకం సాయం కోసం ఎదురు చూస్తున్నారు. వైఎస్ జగన్ హయాంలో బడులు తెరిచే నాటికి రూ.15 వేల సాయాన్ని అందజేసింది. 2019లో సీఎంగా బాధ్యతలు తీసుకున్న నాటి నుంచి ఐదేళ్లు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఒక్కో రైతు కుటుంబానికి ఏడాదికి రూ.13,500 చొప్పున ఐదేళ్లలో రూ.67,500 పెట్టుబడి సాయాన్ని అందజేసింది.



జగన్ హయాంలో 'రైతు భరోసా' అమలు ఇలా..

సంవత్సరం	మండపేట నియోజకవర్గం		రామచంద్రపురం నియోజకవర్గం	
	లబ్ధిదారులు	లబ్ధి (రూ.కోట్లలో)	లబ్ధిదారులు	లబ్ధి (రూ.కోట్లలో)
2019-20	22,413	302.57	19,515	263.45
2020-21	22,413	302.57	19,515	263.45
2021-22	21,592	291,47	18,742	252.77
2022-23	21,440	289.21	18,460	249.21
2023-24 (తొలి విడత)	20,498	15,37,35,000	17,507	13,13,02,500
2023-24 (రెండో విడత)	22,369	9,20,15,711	19,659	8,08,66,855

అన్నదాతా సుఖీభవ పథకానికి అర్హులిలా..

నియోజకవర్గం	రైతులు
మండపేట	22,369
రామచంద్రపురం	19,659
మొత్తం	42,028

ఏడాదికి ఇవ్వాల్సిన సాయం రూ. 84,05,60,000

నెలకు రూ.3వేల నిరుద్యోగ భృతికి అర్హులిలా..



నియోజకవర్గం	కుటుంబాలు	నిరుద్యోగులు
మండపేట	82,079	16,246
రామచంద్రపురం	71,196	14,238
మొత్తం	1,53,275	30,484

ఇవ్వాల్సిన సాయం: నెలకు రూ.9,14,52,000

వైఎస్ జగన్ హయాంలో నాలుగో విడత 'అమ్మఒడి' అమలు ఇలా..



మండలం	లబ్ధి పొందిన తల్లులు	పొందిన సాయం
మండపేట	11,200	రూ.14,56,00,000
రాయవరం	4,796	రూ.6,23,48,000
కపిలేశ్వరపురం	5,445	రూ.7,07,85,000
రామచంద్రపురం	8,544	రూ.11,10,72,000
కె.గంగవరం	5,146	రూ.6,68,98,000
మొత్తం	35,131	రూ.45,67,03,000

తల్లికి వందనం లబ్ధిదారులిలా..

నియోజకవర్గం	లబ్ధిదారులు
మండపేట	21,441
రామచంద్రపురం	13,690
మొత్తం	35,131

ఏడాదికి ఇవ్వాల్సిన సాయం: రూ.52,69,65,000

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం



నియోజకవర్గం	మహిళలు
మండపేట	1,13,224
రామచంద్రపురం	1,02,524
మొత్తం	2,15,748

18 ఏళ్లు నిండిన మహిళలకు రూ.1500 అర్హులిలా..

నియోజకవర్గం	మహిళలు
మండపేట	1,13,224
రామచంద్రపురం	1,02,524
మొత్తం	2,15,748

నెలకు ఇవ్వాల్సిన సాయం: నెలకు రూ.32,36,22,000



ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లకు అర్హులిలా..



నియోజకవర్గం	కుటుంబాలు	ఇవ్వాల్సిన సిలిండర్లు
మండపేట	82,079	2,46,237
రామచంద్రపురం	71,196	2,13,588
మొత్తం	1,53,275	4,59,825

ఏడాదిలో ఇవ్వాల్సిన సిలిండర్లు 4,59,825

క్లుప్తంగా

620 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

మండపేట: మండలంలోని పాలతోడులో నిర్వహిస్తున్న సారా తయారీ కేంద్రంపై రూరల్ పోలీసులు ఆకస్మికంగా దాడి చేశారు. గ్రామంలోని కాలువ దగ్గర నిర్వహించిన సోదాల్లో సారా తయారీకి ఉపయోగించే 620 లీటర్ల బెల్లపు ఊటను గుర్తించి ధ్వంసం చేశారు. ఐదు లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, సారా తయారీకి పాల్పడుతున్న అదే గ్రామానికి చెందిన కల్లి విజయ్‌కుమార్, కురుపూడి సతీష్ అనే ఇద్దరిని అరెస్టు చేశారు. మరో వ్యక్తి పరారయ్యాడని ఈ దాడికి సారథ్యం వహించిన ఎస్ఐ సురేష్‌బాబు తెలిపారు. నిందితులిద్దరినీ పోలీసులు కోర్టులో హాజరుపరచగా రిమాండుకు ఆదేశించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ శభాష్‌పేటకు చెందిన చెల్లే శ్రీనివాసరావు అలియాస్ శాస్త్రి(44) కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ సోమవారం అర్ధరాత్రి మృతి చెందారు. కె.గంగవరం మండలం కుందూరు గ్రామంలో ట్రాక్టరుపై నుంచి జారి పడిపోవడంతో తీవ్రగాయాల పాలైన అతడిని ప్రథమ చికిత్స అనంతరం అదే రోజు జీజీహెచ్‌లో చేర్పించారు. చికిత్స పొందుతూ మృతి చెందారు. శాస్త్రి ట్రాక్టర్ క్లీనర్‌గా పనిచేస్తూ ఖాళీ సమయాల్లో లైటింగ్, పూల డెకరేషన్ పనులకు వెళ్తూ జీవనం సాగించేవాడు. అతడికి భార్య కరుణేశ్వరి, కుమారుడు నాగ వెంకటరాజేష్, కుమార్తె శశి ప్రియాదేవి ఉన్నారు. పోస్టుమార్టం అనంతరం బుధవారం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందజేయగా అంత్యక్రియలు నిర్వహించారు.

రేపు విద్యుత్‌కు అంతరాయం

రామచంద్రపురం: మండలంలో 33/11కేవీ, ఆర్‌సీపీ టౌన్ సబ్‌స్టేషన్‌లో 11కేవి టౌన్ 2 ఫీడర్ టౌన్ వన్ ఫీడర్ మరమ్మతుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడునుందని డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వై.విజయానంద బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ మెయిన్ రోడ్డు, రత్నం పేట, హౌసింగ్ బోర్డు, ముచ్చుమిల్లి, లలిత నగర్, గవర్నమెంట్ హాస్పటల్ కాలేజ్, మోడరన్ కాలేజ్,రామకృష్ణ సెంటర్, బ్రాడీపేట, మార్కెట్ సెంటర్, గవర్నమెంట్ హాస్పిటల్, గాంధీ హాస్పిటల్, ముచ్చిమిల్లి రోడ్డు, కమ్మవారి సావరం, ఆర్డీఓ ఆఫీస్, కవల వారిసావరం, మధ్యనగర్, చప్పిడివారిసావరం, ఆదర్శ హాస్పిటల్, మార్కెట్ సెంటర్లకు విద్యుత్ నిలిపివేస్తున్నట్టు తెలిపారు.

కొనసాగిన గణనాథుని విగ్రహాల నిమజ్జనం

కపిలేశ్వరపురం: మండలంలోని గోదావరి తీరం, పలు గ్రామాల్లోని పంట కాలువల్లో గణనాథుని విగ్రహాల నిమజ్జనాలు బుధవారం సైతం కొనసాగాయి. కపిలేశ్వరపురం, తాతపూడి గ్రామాల్లోని గోదావరి పుష్కర ఘాట్, కోరంగి పంట కాలువ పరిధిలోని వెదురుమూడి, కాలేరు రేవుల వద్ద పలు గ్రామాల నుంచి తరలించిన విగ్రహాలను నిమజ్జనం చేశారు. గణపతి బొప్పా మోరియా అంటూ నినాదాలు చేస్తూ ఉత్సాహంగా విగ్రహాల ఊరేగింపుల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అంగర పోలీసులు, సచివాలయాల్లోని మహిళా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. సచివాలయ ఉద్యోగులు నిమజ్జనం రేవులను పర్యవేక్షించారు. లడ్డూల వేలం మండలంలోని అంగర ఆది గణపతి నవరాత్ర శిబిరంలో మంగళవారం రాత్రి భక్తులు సమర్పించిన లడ్డూలకు వేలం నిర్వహించారు. కాకినాడకు చెందిన షణ్ముఖ స్వీట్ స్టాల్ నిర్వాహకుడు 10 కేజీల లడ్డూను సమర్పించగా గ్రామానికి చెందిన యానాల సీతారామయ్య కుమారులు వీర్రాఘవులు, సుబ్బారావు రూ.మూడు వేలకు పాడుకున్నారు. అంగరకు చెందిన లొల్ల వెంకట్రావు సమర్పించిన 16 కేజీల లడ్డూను రూ.నాలుగు వేలకు అదే గ్రామానికి చెందిన సుంకర నాగు, యర్రా వెంకన్నబాబు పాడుకున్నారు. లడ్డూలను పాడుకున్న భక్తులను ఉత్సవ నిర్వాహక కమిటీ చైర్మన్ పెద్దింశెట్టి సూర్యచంద్రరావు అభినందించారు.

బై బై గణేశా..

రాయవరం: గణపతి బొప్పా మోరియా అంటూ గణేశ్ నిమజ్జనాలు మండలంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. పలు వినాయక కమిటీలు సోమవారం గణనాథుడ్ని నిమజ్జనం చేయగా, మిగిలిన వారు బుధవారం నిమజ్జనాలు చేశారు. యువకులు, మహిళలు కూడా ఉత్సాహంగా నిమజ్జనం వేడుకల్లో పాల్గొన్నారు. రంగులు పూసుకుని, విచిత్ర వేషధారణలు, డీజే శబ్దాలకు అనుగుణంగా డ్యాన్సులు చేశారు. పలువురు మాచవరం, పసలపూడి గ్రామాల ప్రధాన కాలువల వద్ద నిమజ్జనాలు చేశారు. మరికొందరు కోటిపల్లి వద్ద గోదావరి నదిలో నిమజ్జనం చేశారు.



వెదురుమూడి వద్ద పంట కాలువలో విగ్రహాన్ని నిమజ్జనం చేస్తున్న భక్తులు



పసలపూడిలో వినాయక విగ్రహం ఊరేగింపులో వైఎస్సార్ సీపీ శ్రేణుల సందడి

మున్సిపల్ మేనేజర్ కనకరాజుకు సత్కారం



బదిలీపై వెళుతున్న కనకరాజుకు వీడ్కోలు చెబుతున్న చైర్‌పర్సన్, కమిషనర్

మండపేట: మున్సిపల్ మేనేజర్‌గా టి.కనకరాజు సేవలు గుర్తుండిపోతాయని చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి కొనియాడారు. రెండేళ్ల పాటు మున్సిపల్ కార్యాలయంలో మేనేజరుగా పని చేసిన కనకరాజు సామర్లకోట మున్సిపాలిటీకి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయనను బుధవారం ఘనంగా సన్మానించారు. కార్యాలయంలోని చైర్‌పర్సన్ చాంబర్‌లో కొత్తగా బాధ్యతలు స్వీకరించిన కమిషనర్ రంగారావు, చైర్‌పర్సన్ దుర్గారాణి దుశ్శాలువాలు, పూలమాలలు వేసి సత్కరించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ రాణి మాట్లాడుతూ కనకరాజు కిందిస్థాయి సిబ్బందితో కలసి మెలసి ఉంటూ పరిపాలనా విభాగాన్ని సమర్థవంతంగా ముందుకు నడిపించారన్నారు.కమిషనర్ రంగారావు మాట్లాడుతూ మేనేజర్ కనకరాజుతో ఉయ్యూరు నగర పంచాయతీలో 8 నెలలు కలిసి పని చేశామన్నారు. సమయపాలన పాటిస్తూ అంకితభావంతో పనిచేసేవారన్నారు. అనంతరం ఇచ్ఛాపురం మున్సిపాలిటీ నుంచి బదిలీపై వచ్చి మేనేజరుగా బాధ్యతలు స్వీకరించిన హరిమోహన్‌కు వారు శాలువాలు కప్పి స్వాగతం పలికారు. కార్యక్రమంలో మున్సిపల్ ఉద్యోగులు, సిబ్బంది, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

కె.గంగవరం: విద్యార్థి దశ నుంచి క్రీడలు ఆడడం వల్ల అవి మానసికోల్లాసానికి దోహదపడతాయని ఎంపీపీ పంపన నాగమణి అన్నారు. పామర్రు ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో బుధవారం మండల స్థాయి క్రీడా పోటీలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఏటా విద్యార్థులకు మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్‌ను నిర్వహిస్తారని ఈ ఏడాది కూడా క్రీడా పోటీలు జరగడం అభినందనీయమన్నారు. పోటీలలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని విజయం సాధించి పాఠశాలలకు మంచి పేరు తేవాలని కోరారు. అనంతరం పలు పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థులకు వ్యాయామ ఉపాధ్యాయులు కబడ్డీ, ఖో ఖో, వాలీబాల్ తదితర అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. రెండు రోజుల పాటు మండల స్థాయి పోటీలు నిర్వహిస్తామని వీటిలో విజయం సాధించి వారు నియోజకవర్గ స్థాయి పోటీలలో పాల్గొంటారని వ్యాయామ ఉపాధ్యాయులు పేర్కొన్నారు. సర్పంచ్ వాసంశెట్టి వెంకట దుర్గ, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

కపిలేశ్వరపురంలో..

కపిలేశ్వరపురం: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి క్రీడా పోటీలను బుధవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎంఈఓ కె.తాతారావు ప్రారంభించారు. హెచ్‌ఎం వంగా శ్రీనివాస్, పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ కొప్పిశెట్టి సతీష్‌లు పలు విభాగాల క్రీడలను ప్రారంభించారు. న్యాయ నిర్ణేతలుగా పీడీ గుబ్బల వేణుగోపాలరావు, ముత్తా సత్యనారాయణ, మేకా సత్యనారాయణ, దుర్గాప్రసాద్, బేగం, రవికుమార్ వ్యవహరించారు.

విద్యార్థులు సత్ ప్రవర్తనతో నడవాలి

సీఐ అశోక్‌కుమార్



సమావేశంలో ప్రసంగిస్తున్న సీఐ అశోక్‌కుమార్

రామచంద్రపురం: ప్రతి విద్యార్థి సత్ప్రవర్తనతో ముందుకు నడవాలని, లేకుంటే కళాశాల జీవితాన్ని వీడి జైలులో గడపాల్సి ఉంటుందని రామచంద్రపురం సీఐ కె.అశోక్‌కుమార్ అన్నారు. పట్టణంలోని కృత్తివెంటి పేర్రాజు పంతులు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం కళాశాల విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎ.వీరన్న అధ్యక్షతన జరిగిన అవగాహన కార్యక్రమంలో సీఐ అశోక్‌కుమార్ ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. 18 ఏళ్లు నిండకుండా లైసెన్సు లేకుండా బైక్ నడిపితే నేరమన్నారు. దీనిపై పోస్కో చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. పూర్తిగా 19 సంవత్సరాల వస్తేనే గాని యుక్త వయస్సు వచ్చినట్లు కాదని చిన్న వయసులో చేసినటువంటి చిన్న చిన్న పొరబాట్ల కారణంగా వివాహమైన తర్వాత ఎదుర్కొంటున్న వేధింపులు తదితర అంశాలపై చర్చించారు. ముఖ్యంగా మత్తు పదార్థాలైనా మద్యం గంజాయికి యువత దూరంగా ఉండాలని లేకుంటే జీవితం సర్వనాశనం అవుతుందని గమనించాలన్నారు.ఈ సందర్భంగా తొలుత సీఐ అశోక్ కుమార్‌ను జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఏ వీరన్న పూర్వ విద్యార్థి సంఘం నాయకుడు సిరిగినేడి దుర్గాప్రసాద్ తదితరులు సత్కరించి బొకేతో స్వాగతం పలికారు.

పట్టణాభివృద్ధికి కృషి చేయాలి

- వైఎస్సార్ సీపీ నేత రెడ్డి రాధాకృష్ణ
- కొత్త మున్సిపల్ కమిషనర్ రంగారావుతో ఆ పార్టీ నేతల భేటీ



కమిషనర్‌ను సత్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

మండపేట: మునిసిపల్ కమిషనర్‌గా కొత్తగా బాధ్యతలు చేపట్టిన రంగారావు మండపేట పట్టణాభివృద్ధికి అంకితభావంతో పనిచేసి ప్రజా మన్ననలు పొందాలని వైఎస్సార్ సీపీ నేత రెడ్డి రాధాకృష్ణ (రాజబాబు) ఆకాంక్షించారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన కమిషనర్‌ను బుధవారం వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు, ఆ పార్టీ నాయకులతో కలసి రాజబాబు మర్యాద పూర్వకంగా కలిశారు. శాలువాతో రంగారావును సత్కరించి స్వీట్‌బాక్స్ అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పిల్లి శ్రీనివాస్, సొసైటీ మాజీ అధ్యక్షుడు పెంకే గంగాధర్, ఆంజనేయస్వామి దేవస్థానం మాజీ చైర్మన్ సూరంపూడి సత్యప్రసాద్, పార్టీ నాయకులు పెంకే వెంకట్రావు, అధికారి శ్రీనివాస్, ముక్కా దాలయ్య, పాలిమాల సత్తిబాబు పాల్గొన్నారు.

ఉపాధి నిధులతో గ్రామాల అభివృద్ధి

మండపేట: గ్రామాల అభివృద్ధికి ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు సూచించారు. మండపేట మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం ఎంపీపీ అధ్యక్షుడు వుండమట్ల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ఎమ్మెల్సీ తోట, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ఎక్స్ అఫీషియో సభ్యులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సభ్యులు పలు సమస్యలపై సమావేశంలో చర్చించారు. ఎమ్మెల్యే తోట తన ప్రసంగంలో ఉపాధి పనుల కేటాయింపు, నిధులు ఖర్చు విషయంలో ఏడాది కాలాన్ని ప్రామాణికంగా తీసుకుంటున్నారా? ఐదేళ్ళ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా పనులు చేపడుతున్నారా? అని అధికారులను ప్రశ్నించారు. ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ,ఏడిద సర్పంచ్ బూరిగ ఆశీర్వాదంతో పాటు పలువురు సభ్యులు పలు ప్రజా సమస్యలను సమావేశంలో ప్రస్తావించారు. సమావేశంలో ఎంపీడీవో సత్యనారాయణమూర్తి, డీఎల్‌పీవో ఐదం రాజు, సూపరింటెండెంట్ ప్రసాద్, పంచాయతీ అధికారులు, సభ్యులు పాల్గొన్నారు.

పేకాట నిర్వాహకులపై రౌడీ షీట్లు ఓపెన్ చేస్తా

రామచంద్రపురం: స్థానిక సర్కిల్ పరిధిలో ఎవరైనా పేకాట, కోడి పందాలు నిర్వహిస్తే నిర్వాహకులపై రౌడీ షీట్స్ ఓపెన్ చేస్తామని సీఐ కె.అశోక్ కుమార్ హెచ్చరించారు. సీఐ కార్యాలయంలో బుధవారం స్థానిక మీడియా ప్రతినిధులతో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో ఎక్కడైనా పేకాట ఆడినా, కోడిపందాలు వేసినా ఉపేక్షించేది లేదన్నారు. వీటిని ఉక్కుపాదంతో అణిచి వేయాలని తమకు ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయన్నారు. వీటిని రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు అర్థం చేసుకుని ఇందుకు సంబంధించిన సమాచారం ఏమైనా ఉంటే సీఐ, ఎస్ఐలకు తెలియజేయాలన్నారు. పండగ సీజన్‌లలో అస్లీల నృత్య ప్రదర్శనలు, అసాంఘిక కార్యక్రమాలు ఏర్పాటు చేసిన సహించేది లేదన్నారు.